# అన్నప్రాశన

**కా**ర్యానికి వచ్చిన వాళ్ల హడావిడి తగ్గింది. నీలవేణి కొడుక్కి అన్నప్రాశనకి పిలిచిన వాళ్లందరూ వచ్చారు. నీలవేణి అత్తగారూ, మామగారూ ఆడబడుచూ ముగ్గురూ వచ్చారు. అన్నప్రాశన, సత్యనారాయణ వ్రతం, విందు భోజనాలూ అన్నీ అయి ఎక్కడివాళ్లు అక్కడికి వెళ్లిపోయారు.

అక్కాబావా వచ్చిన దగ్గర నుంచీ పద్మ వాళ్లని మరో నాలుగు రోజులుండమని బ్రతిమాలుతూనే ఉంది.

'' ఇంకెన్నాళ్లు ఉంటే నీ సరదా తీరుతుందట ! బుజ్జిగాడితో నువ్వయితే ఆడుకుంటావ్ ఎంచక్కా బాగానే ఉంది కాని మరి నా ఉద్యోగం మాటేమిటి ? ఊరికే శెలవు పెట్టి నీకూ నీ అక్కకూ ఎదురుగా కూచుంటే అవతల మా ఆఫీసు పని సంగతేమిటి ?'' బావ దీర్ఘాలు తీశాడు.

'' చాల్లే బావా బడాయి ! నువ్ మరో రెండ్రోజులు ఇక్కడ ఉంటే గోదావరికి నిప్పంటుకోదు! హైదరాబాదులో వరదలూ రావు ...

'' ప్లీజ్ బావా ...! '' అంది పద్మ.

బావయితే మాటాడలేదు కానీ కాసేపయ్యాక ఏకాంతంలో '' అబ్బా అలాగే లేవే ... ఎటొచ్చీ అత్తయ్య గారూ వాళ్లూ వెళ్లాక మరొక్కరెండురోజులు ఉండటానికి నేను ఒప్పించాలే !''

అని చెల్లికి చెప్పింది నీలవేణి.

'' అవును, అక్కా, నీ మాటంటే తిరుగులేదక్కా - బావ నువ్వెంత అంటే అంతే ... బావ మంచివాడు కదక్కా!''చెల్లెలు ప్రశ్నవిని పెళ్లయి సంవత్సరం తిరగకుండా కొడుకు నెత్తుకున్న నీలవేణి కొంచెం ఉలిక్కిపడింది. పద్మ గడుగ్గాయి. ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేస్తుంది - రాయి వేసి లోతు కనుక్కుంటుంది.

'' చాల్లే బావ మంచీ నీ మంచీ ...'' అనేసి నీలవేణి నవ్వింది ఒడుపుగా.

'' బావ సరేలే ... మీ అత్తగారు చాలా సౌమ్యురాలు సుమా నాకు ఆవిడంటే ఎంతో ఇష్టం. మీ ఆడపడుచు సరేసరి. ఎమ్మే చదువుకున్నా బడాయిలు పోదు... మీ అత్తగారు నిన్ను బాగా చూసుకుంటారని నువ్వు ఉత్తరం రాసినప్పుడల్లా - ' మంచి వాళ్లూ, కడుపు తీపి తెలిసినవాళ్లూ కొంతమందయినా ఉన్నారు కనుకనే ఇలా ఈ మాత్రంగా ఉన్నాం' అంటూ ఉంటుంది అమ్మ. ఆవిడ చాలా మంచావిడ కదక్కా?' మళ్లీ అంది పద్మ.

' ఆఁ మంచావిడేనే.' ' అత్త మంచీ, కత్తి మెత్తనా ' అని -

' అదేంటక్కా అలా అంటావ్ ?'

'అదంతేలే ... ఎన్ని తిప్పలు పడ్డానో నీకేం తెలుసు ... బుజ్జిగాడికి అన్నప్రాశన ఇక్కడ చేస్తే బాగుంటుందత్తయ్యా అని ముందు బ్రతిమాలడం ఆవిడతో ప్రారంభించాను. ఈయనగారి చే తయితే ఎలాగేనా ఒప్పించవచ్చు. అయితే ఉన్నమాట చెప్పాననుకో... వాళ్లకయితే బుజ్జిగాడు మూడో మనవడు... మరి మన అమ్మా, నాన్నకి బుజ్జిగాడు మన ఇంటిలో మొదటి మనవడు కదా...''

'' నువ్ గడుసు దానివక్కా!'' పద్మ అక్క తెలివి తేటలకి మురిసిపోయింది.

''కార్యం ఘనంగా జరిపించేశావ్ కోడలా!'' అంటూ పద్మ బుగ్గమీద అక్క అత్తగారు చిటికె వేసింది బొట్టు పెట్టించుకుని గుమ్మం దిగితూ.

'వస్తా వదినా' అంటూ ఆడబడుచు నీలవేణిని కౌగిలించుకుని మరీ రిక్షా ఎక్కింది.

'' మామ్మకీ, అత్తకీ టాటా చెప్పు '' అంటూ బుజ్జిగాడి చేత వీడ్కోలు చెప్పించింది పద్మ.

ఎక్కడి వాళ్లు అక్కడికి వెళ్లిపోయాక నీలవేణి అదోలా ఉండటం గమనించింది పద్మ. బావ, అక్కా ఏమయినా మాట మాట అనుకున్నారా అన్న అనుమానం వేసింది. ఎవరి మానాన్న వాళ్లు ముభావంగా ఉండటం చూసి పద్మ ముఖం చిన్నబుచ్చుకుంది.

కేవలం చిన్న బుచ్చుకుని ఏం ప్రయోజనం. ఏమైందో తెలుసుకోవాలి. తనూ ముఖం వేలేసుకుంటే విషయం బయటకు పొక్కదు.

పద్మ గదిలోకి వెళ్లి ఓ నిమిషం తీవ్రంగా ఆలోచించింది.

''అక్కా బావా, నువ్వు నేనూ బుజ్జిగాడూ సాయంకాలం సినిమాకి వెళదాం... నా మొదటి జీతంలో నువ్వొచ్చే వరకు ఏం ఖర్చుపెట్టనని అలా అమ్మ దగ్గర ఉంచేశాను ...'' అంటూ అక్క దగ్గరకు వెళ్లింది.

'' బుజ్జిగాడితో ఏం సినామా లెద్దూ... నాకు సినిమా చూడాలని లేదు లేవే!'' అనేసింది అక్క.

పద్మకి ఏం తోచలేదు. అదను దొరికితే చాలు సరదాగా చొరవగా కబుర్లు చెప్పే బావ ఏమిటో దీర్ఘంగా ఆలోచించడం వింత అనిపించింది. అతను తనని కవ్వించకపోవచ్చు – తప్పించుకు తిరగవచ్చు.... లేదా ముభావంగా ఉండవచ్చు ... కాని తనకేం తను చొరవ తీసుకోవచ్చుగా –

బావ పందిరి మంచం మీద పడుకుని దినపత్రిక వాళ్లందించిన ఖాడీలోని సంకట స్థితి గురించి కళ్లింతలు చేసుకుని చదువుతూ ఉంటే మెల్లగా రంగ ప్రవేశం చేసింది పద్మ.

'' ఏం బావా! అలా ఉన్నావ్! అక్కఏమైనా అంటే అట్టే పట్టించుకోకు. దాని వాటం అంతే. మాట కటువు ... మనసు వెన్న ముద్ద ... అత్తయ్య గారికి అక్క అంటే ఎంత ఇష్టమో నీకు తెలియనిది కాదు ...''

'' చూడు పద్మా! మీ అక్క పొగడ్తలు నాదగ్గర చెప్పకు – '' అనేసి గోడవంక తిరిగి పేపర్లో లీనమైపోతుండగా ఉండు బావా, ఉండు ... అక్కనంటే నేను ఊరుకోను ... బుజ్జిగాడూ; ఒరేయ్ నువ్వు చెప్పు ... అమ్మ మంచా ? నాన్న మంచా ?'' మంచం మీద పక్కన కూర్చుని మరీ అడిగింది పద్మ. బుజ్జిగాడిని ఒడిలో ఒద్దికగా కూచోపెట్టుకుంటూ...

'' నన్ను చదువుకోనివ్వవు కదా !'' చటుక్కున మంచం దిగాడు బావ. వెంటనే బట్టలు వేసుకుని బయటకు వెళ్లిపోయాడు.

పద్మ తెల్లబోయింది. ఆలోచన ఏదో వచ్చి కడుపులో తిప్పుతున్నట్టనిపించింది. నీరసం వచ్చి ఒళ్లు చల్లబడుతున్నట్టనిపించింది.

బయటపడకుండా బావ అక్కని హింసలు పెడుతున్నాడా ? అక్క పాపం ఎలా భరిస్తోందో !

అసలు ఏం జరిగి ఉంటుంది ?

అన్నప్రాశనే కదా అని నాన్నగారు బావగారికి గానీ కార్యానికికని ఇంటికి వచ్చిన వియ్యాల వారికి గానీ ఏం తక్కువ చెయ్యలేదే –

వారు వస్తున్నారన్న వార్త విన్న దగ్గర నుంచీ వియ్యాల వారికి చెయ్యాల్సిన మర్యాదల గురించి అతి జాగ్రత్త వహించారే. బట్టలు వాళ్లకు నచ్చాలని అక్క చేతికి డబ్బిచ్చి వాళ్లనీ బజారుకు తీసుకు వెళ్లి మరీ కొనిపించారే...

ఆడపడుచుకి ఆవిడ హోదా, వయసు, అందం దృష్టిలో పెట్టుకుని నాలుగు వందల రూపాయలకి జార్జెట్ చీర, అత్తగారికయితే మరో యాభై తక్కువయినా బాగా డాబుగా కనిపించే జరీచీర, బావకి బాగా నచ్చిన పాలిస్టర్ ఫ్యాంటూ, షర్టూ – బుజ్జిగాడికీ, అక్కకీ కూడా దర్జా అయిన బట్టలు కొన్నారు. అక్కమామగారికి దక్షిణాది జరీ పంచ, కండువా – కట్టుకుని ఆయనే మురిసిపోయి భార్య వంక విజయగర్వంతో చూడడం తను కళ్లారా చూసిందే. ...

ఆడబడుచు కొంటె మనిషి కాదు. చదువుకున్నందుకు మంచి ఆదర్శ భావాలున్న మనిషి అని మెచ్చుకుంటుంటే – ఆవిడేమయినా పుల్ల విరుపు మాటలాడి అన్నగారిని రెచ్చకొట్టిందా ?

బావలో ఈ బింకం తనెప్పుడూ కనపడలేదే !

'' అక్కా, బావ ...''

'' ఏమిటి ?''

'' ఎక్కడికో, నీతో చెప్పనయినా చెప్పకుండా... వెళ్లిపోతేను ... ''

'' నాతో చెప్పి వెళుతున్నారనుకోవడంలోనే ఉంది నీ అమాయకత్వం '' – పద్మ ఎందుకు అన్నానా అని బాధపడింది.

మరి కాసేపయ్యాక బుజ్జిగాడ్ని ముస్తాబు చేసి పక్కవాళ్ల ఇంటి అబ్బాయిచేత షికారుకు పంపించి మళ్లా అక్క దగ్గరకు వచ్చింది.

పద్మ రావడం దూరం నుంచే పసిగట్టి మెల్లగా కళ్లు తుడిచేసుకుంది అక్క.

'' ఏం జరిగిందక్కా? ... వాళ్లేమయినా అన్నారా ?''

'' ఛ, ఛ .... అదేం లేదు.''

'' బావ ... ఏమయినా ....''

'' ఏం చెప్పనే – అమ్మ వింటే బాధపడుతుంది.... ఇంతా చేస్తే ఏం లేదు... మొదటి నుంచీ ఈ వేడుక మనింట్లో జరిపించాలని నా సరదా. వాళ్ల ఇంట్లోనయితే బాగుంటుందని ఆయన పట్టుదల. చెప్పిగా,... నేను అత్తగారి చేత చెప్పించి ఆయనగారి ముందరి కాళ్ల బంధం వేసేశాను. ఈగ వాలునా ఈ పట్టునా ఎలాగయినా నా మీద విరుచుకు పడదామని చూస్తున్నారు. కారణం ఏమీ దొరకలేదు. ఇది కారణమై కూచుంది ...'' ఉస్సురంటూ చెప్పింది నీలవేణి.

'' ఏమిటక్కా ఆ కారణం ....''

'' బుంగమూతి కోపానికి కారణమేమిటి ? ఏదో ఒకటి దొరకాలి. ఎంతయినా అల్లుడుగారు కదా ...'' నీలవేణి కసిగా అంది.

అక్కముఖం అంత అందంగా ఎర్రబడడం చూస్తూ మైమరచిపోయింది పద్మ.

'' మగాడయితే చాలు...ఏదో ఓ బడాయి.. ఛి..ఛీ... మగాళ్లందరూ ఇంతే ... దేభ్యం మొహమట.... మేనమామ పోలికట... తిండిపోతట ... భ్రభ్రాజమానం - భజగోవిందమట... చంటివాడిని ఎల్లా ఆడిపోసుకున్నారో ... గంటసేపు సతాయించారు. నాకు ఒళ్లు మండిపోయింది.''

'' ఇంతకీ చంటాడేం చేశాడక్కా... మావ కొత్త చొక్కామీద కొంపదీసి ...''

'' అదేం కాదే ... పురోహితుడు అన్నప్రాశన ముందు వెండి భరిణలో కుంకం, పసుపు... అరటిపళ్లు - పుస్తకం, కలం బంగారు గొలుసు - మిఠాయి పళ్ళెం ... ఇవన్నీ పెట్టాడుగా ... బుజ్జిగాడు పాక్కుంటూ వెళ్లి మిఠాయి పళ్లెం ముందు లాగి .... తరువాత అరటిపండు తీశాడు. అందరం నవ్వేశాం... గుర్తుందా ... వాళ్ల పెద్దనాన్నగారబ్బాయట... పెన్ను తీశాడట ... ఎల్‌కేజీ నుంచి క్లాసు ఫస్టట ... మన వాడూ ఉన్నాడు ... వివాహభోజనంబు గాడు... తిండిపోతు ... భ్రభ్రాజమానం.'' అబ్బ ఆయన మాటలు మరి చెప్పలేననుకో ...''

మళ్లీ దుఃఖం కట్టలు తెంచుకుని ప్రవాహమై పెల్లుబికి అక్క ఉక్కిరి బిక్కిరయిపోయింది.

'' ఓసి నీ తెలివి గూల ! అల్లుడు అనడం బావుంది. దానికి నువ్వు మనసు కష్ట పెట్టుకోవడమూ బాగుంది. ఏదో సరదాకి చేసే పని - చిన్న పిల్లవాడి చేష్టలకి అర్థం చెప్పుకోవటమేమిటి పోనిద్దూ ... నువ్వూరుకో ... శుభమా అని ఇంటకార్యం చేసుకుని ఇదేమిటి ఈ చోద్యం ...''

''లే ముఖం కడుక్కుని చీర మార్చుకో - అల్లుడు వచ్చినట్టున్నాడు - అలా ఎక్కడికయినా వెళ్లి రమ్మని చెబుతా... పద్దూ నువ్వు బుజ్జిగాడిని చూసుకోవే... వాళ్లకి ఆ ఊళ్లో ఎక్కడికీ వెళ్లటానికి కుదరనే కుదరదు....''

పెద్దావిడ రంయ్‌మని రంగంలోకి దిగింది.

పావుగంటలో అట్టే పాతబడని జంట రివ్వున రిక్షాలో సాగిపోయింది.

రాత్రి వడ్డిస్తూ అంది పెద్దావిడ ... '' మా చెల్లిలి కొడుకు అదేనే రవిగాడు - చూశారా అల్లుడుగారూ ... ఐ.ఏ.ఎస్.లో దేశానికంతటికీ మొదటివాడుగా వచ్చాడు ... పెళ్లికి వచ్చాడు... ఒంగోలులో జాయింటు కలక్టరుగా ఉన్నాడులెండి. వాడు అన్నప్రాశన నాడు ఏం తీశాడో తెలుసా ...''

'' అరటి పండా ? లాడూ ఉండా ?'' పద్మ ఆత్రంగా అడిగింది.

'' ఆ రెండూకావు... ఆ వస్తువులన్నీ పెట్టిన వైపు చూడకుండా... అలా పాకు కుంటూ వెళ్లి మూలకెళ్లి అరటి తొక్కతీసి నిటారుగా కూర్చుని నోట్లో పెట్టుకున్నాడు. భడవ... మేమంతా ఒకటే నవ్వు ....''

అల్లుడుగారికీ నవ్వాగలేదు... అతను నవ్వుతుంటే అక్క మొహం సన్నగా చిన్నగా ఎర్రబడుతుంటే పద్మమొహం మాత్రం మతాబాలా వెలిగిపోయింది.

**ఆకాశవాణి, విశాఖపట్నం ప్రసారం**

**9-5-1991**